

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,91,660లు, బంగారం 600 మిల్లీగ్రాములు, వెండి 24.85 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



గ్యాస్ ధర పెంపుపై సర్వత్రా నిరసన - 8లో



లక్ష్యం పైనే గురిపెట్టాలి - 8లో

న్యూస్‌రీల్

టికిరిలో వైద్య సేవలు మృగ్యం



తాళం వేసి ఉన్న ఆరోగ్య కేంద్రం

రాయగడ: జిల్లాలోని టికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్య సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. అంతంతమాత్రంగా వైద్యం దొరికే ఈ ప్రాంతంలో రాత్రి వేళల్లో సేవలు పూర్తిగా స్తంభించిపోవడంతో బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. గత కొద్ది నెలలుగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో సాయంత్రానికే తాళం వేస్తుండటంతో అత్యవసర సమయాల్లో వైద్యం కోసం వెళ్లిన రోగులు ప్రైవేటు ఆస్పత్రుల వైపు పరుగులు తీయాల్సి వస్తోంది. విషయాన్ని జిల్లా ముఖ్య వైద్యాధికారికి తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు లేవని టికిరి గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి, 24గంటలు సేవలందించాలని కోరుతున్నారు.

5టీ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ విశాల్‌సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితిలో ఉన్న మూడు 5టీ పాఠశాలలను కలెక్టర్ విశాల్ సింగ్ గురువారం సందర్శించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న 5టీ కార్యాచరణలో పాఠశాలల అభివృద్ధి, నూతన భవన నిర్మాణం, ప్రయోగశాలలు, పరికరాలు సమకూరుస్తామని తెలిపారు. అలాగే విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిచేందుకు చర్యలు చేపడతామని వివరించారు. దీనికి అనుగుణంగా అధికారులు కృషి చేయాలని సూచించారు.

గంజాయి కొనుగోలుకు వెళ్తూ..



కారుతో పట్టుబడిన నిందితులు

జయపురం: గంజాయి కొనుగోలు చేసేందుకు రాజస్థాన్ నుంచి కారులో ఒడిశాకు చేరుకున్న ఇద్దరు నిందితులను జయపురం సదర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజాము 3.30 గంటల సమయంలో ఎస్‌ఐ పండా నేతృత్వంలో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. అదే సమయంలో కొట్ట జంక్షన్ వెళ్తున్న కారును పాత్రొపుట్ వద్ద అడ్డగించి, అందులోని వారిని విచారించారు. ఈ మేరకు డ్రైవర్ గోపాల్ లాల్‌జాత్ తమది రాజస్థాన్ రాష్ట్రమని తెలిపాడు. అయితే ఎందుకు వచ్చారో సరైన సమాధానం చెప్పక పోవడంతో కారును తనిఖీ చేశారు. అందులో రూ.2,50,000లు పట్టుబడగా, అదుపులోకి తీసుకొని విచారించడంతో ఆంధ్రప్రదేశ్ లోని బందవీధి గ్రామంలో ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసేందుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. దీంతో వాహనంలో ఉన్న మరో ఇద్దరిని సైతం అరెస్ట్ చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ప్రమేయం ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

జయపురం: గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో బొయిపరిగుడ సమితి చంద్రపడ పంచాయతీ ఖొరాగుడ గ్రామానికి చెందిన సమర ఖొరా(50) తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి దలపూర్ సమీపంలోని డాల్ భట్ గ్రామంలో జరుగుతున్న వివాహంలో పాల్గొనేందుకు వెళ్లిన అతను.. గురువారం ఉదయం ఇంటికి నడిచి వస్తుండగా సహిద్ లక్ష్మణ నాయక్ జూనియర్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతనని అంబులెన్స్‌లో బొయిపరిగుడ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఏఎస్‌ఐ శివశంకర నాయక్ కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన బైక్ కోసం గాలిస్తున్నారు.



రాయగడ: స్వచ్ఛ సాథీలకు సైకిళ్ల పంపిణీ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు



జయపురం: సైకిల్ పంపిణీని ప్రారంభిస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్



పర్లాకిమిడి: లబ్ధిదారులకు సైకిళ్లు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి

సమయ పాలనకు సైకిళ్లు



భువనేశ్వర్:కార్యక్రమానికి హాజరైన మిషన్‌శక్తి మహిళలతో సీఎం ఫొటో ముచ్చట

- రాష్ట్రవ్యాప్తంగా 8వేల మంది సాథీలకు పంపిణీ
- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్
- జిల్లా కేంద్రాల్లో లబ్ధిదారులకు అందజేసిన అధికారులు

భువనేశ్వర్: జల సాథి, ఆహార సాథి, స్వచ్ఛ సాథి సూపర్‌వైజర్లకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లోని లోక్‌సేవా భవన్ సమావేశం హాలులో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సీఎం నవీన్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సాధికారిత బాటలో మహిళల విజయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వీరి ఆత్మ విశ్వాసంతో మిషన్‌శక్తి కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందని అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా 8వేల మంది సామాజిక మహిళా కార్యకర్తలకు సైకిళ్ల పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. జలసాథి కార్యకర్తలు బాగా పనిచేస్తున్నారని కొన్ని నెలల క్రితం సీఎం హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వీరి దైనందిన కార్యకలాపాలలో రాకపోకలకు వీలుగా సైకిళ్ల పంపిణీ చేస్తామని అప్పట్లో ప్రకటించారు. మిషన్‌శక్తి సభ్యులు తమ విధులకు నడచి వెళ్లి, రావడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి సమయం వృథా కాకుండా రాష్ట్రప్రభుత్వం వీటిని సమకూర్చిందన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ, మిషన్‌శక్తి శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జయపురంలో..

జయపురం: స్థానిక పట్టణంలో మిషన్‌శక్తి పథకంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సైకిళ్ల పంపిణీ చేశారు. టౌన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి పాల్గొని, 97మంది సైకిళ్లను అందజేశారు. వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, సబ్ డివిజన్ సమాచార, పౌర సంబంధాల అధికారి యశోద గదబ, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సాథీలకు సైకిళ్ల పంపిణీ

రాయగడ: మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ సాథీ, స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన సైకిళ్లను అధికారులు గురువారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి భువనేశ్వర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని రాయగడ మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయ మాఝి, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్‌పర్సన్ శుభ్రా పండా తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 104మందికి వీటిని అందించినట్లు చైర్మన్ పట్నాయక్ తెలిపారు.

పర్లాకిమిడిలో 59మందికి..

పర్లాకిమిడి: పురపాలక కౌన్సిల్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులు, స్వచ్ఛ సాథీలు, ఆహారకేంద్రం కార్యకర్తలు, జల సాథీలకు రాష్ట్రప్రభుత్వం అందించిన సైకిళ్లను పర్లాకిమిడిలో డీఆర్‌డీఏ ఈఓ, సీడీఎంఓ రమాంచల్ ఖమారీ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 59మందికి వీటిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డిప్యూటీ కలెక్టర్ నటబర గరోడో, పురపాలక వైస్ చైర్మన్ లెంక మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా శెఠి మాట్లాడుతూ సీఎం నవీన్ పట్నాయక్ మిషన్‌శక్తి మహిళలకు రూ.100 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగించు కోవాలని సూచించారు.



భువనేశ్వర్: జెండా ఊపి సైకిల్ పంపిణీని ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్:మహిళా కార్యకర్తలకు స్వయంగా సైకిల్ అందిస్తున్న ముఖ్యమంత్రి

విద్యార్థినిపై కత్తితో దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు తిరుమలరావు



రాయగడ: ప్లస్‌-2 పరీక్షలు రాసి తిరిగి వస్తున్న విద్యార్థినిపై యువకుడు కత్తితో దాడి చేసి, గాయపరిచిన ఘటన జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ గుమడలో చోటు చేసుకుంది. గురువారం జరిగిన ఘాతకానికి సంబంధించి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. దీనికి సంబంధించి గుమడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమడలోని ద్రౌపది విద్యాపీఠంలో ప్లస్2 ఆర్ట్స్ చదువుతున్న నిహారిక మహంతి(17) గురువారం ఉదయం పరీక్షకు హాజరైంది. తిరిగి తన నివాసానికి వస్తుండగా ఉత్కళ గ్రామీణ బ్యాంకు వద్ద కాపుకాసిన ఉన్న తిరుమలరావు(18) హఠాత్తుగా పదునైన కత్తితో ఆమె గొంతు కోసి దాడి చేశాడు. దీంతో విద్యార్థిని అక్కడిక్కడే కుప్పకూలిపోయి, అపస్మారక స్థితిలోకి జారుకుంది. గమనించిన స్థానికులు, తోటి విద్యార్థులు నిందితుడిని పట్టుకున్నారు. వారు అందించిన సమాచారం మేరకు పోలీసులకు వెంటనే అక్కడికి చేరకొని, తిరుమలరావును అదుపులోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన నిహారికను పద్మపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. బాధితురాలితో పాటు నిందితుడి స్వగ్రామం బిసంకటక్ అని తేలింది. అయితే ఈ దారుణానికి పాల్పడటానికి గల కారణాలు తెలియలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు



మెడపై తీవ్ర గాయంతో నిహారిక

14 నుంచి తరతరణి చైత్రోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

- మద్యం, పాలిథిన్ వినియోగంపై నిషేధాజ్ఞలు
- ఏర్పాట్లపై కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా అధ్యక్షతన సమావేశం

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దేవత పురుషోత్తంపూర్ సమీపం రుశికుల్యా నదీతీరంలో ఉన్న తరతరణి అమ్మవారి చైత్రమాస ఉత్సవాలు ఈనెల 14నుంచి ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా వెల్లడించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్ లోని కార్యలయంలో కలెక్టర్ అధ్యక్షతన ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 21, 28, ఏప్రిల్ 4తేదీల్లో ప్రతి మంగళవారం ఉత్సవాలు జరగనున్నాయన్నారు. ఒడిశాతో పాటు సరిహద్దు రాష్ట్రాల ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన దాదాపు 30లక్షల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేశారు. వచ్చే వారికి వసతి, తాగునీరు, వాహనాల పార్కింగ్, ఆరోగ్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కొండపై మద్యం, పాలిథిన్ వినియోగంపై నిషేధం విధిస్తున్నామని ప్రకటించారు. భక్తుల రక్షణ చర్యల నేపథ్యంలో అదనపు పోలీసులు బలగాలను కేటాయించాలని ఎస్పీకి సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సరోజ్‌కుమార్ మిశ్రా, ఏఎస్పీ అజయ్‌ప్రతాప్ స్వాయి, ఎస్‌డీపీఓ దిలీప్‌కుమార్ దాస్, ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి ప్రమోద్‌కుమార్ పండా, ఎగ్జిక్యూటివ్ అధికారి టీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండపై కొలువైన తరతరణి అమ్మవారు

చేనేతలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు

జయపురం: చేనేత వస్త్రాలకు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ అన్నారు. పట్టణంలోని దసరా పొడియ ప్రాంగణంలో జిల్లాస్థాయి చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌లో కొట్‌పాడ్‌కు చెందిన నేత కార్మికుల తయారు చేసే చీరలు జాతీయ స్థాయి గుర్తింపు పొందాయన్నారు. అలాగే రాష్ట్రపతి నుంచి అవార్డులు సైతం పొందారని గుర్తుచేశారు. ప్రదర్శనలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన చేనేతకారులు 38 స్టాల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈనెల 6వరకు జరగనున్న ఎగ్జిబిషన్‌లో ప్రతి కొనుగోలుపై 10శాతం నుంచి 20శాతం రాయితీ ఉంటుందని, ఆసక్తిగల వారు వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ, తహసీల్దార్ సుశ్రీ సాగరిక షాడంగి, చేనేత సంఘం ప్రతినిధి అర్ధరంజన్ మహాపాత్రొ, ప్రదర్శన పరిచాలకులు అనీల్‌కుమార్ దాస్, దేవేంద్ర బహిణీపతి తదితరులు పాల్గొన్నారు.



చేనేత ప్రదర్శనలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రధాన్

ఎస్ఆర్‌సీగా నికుంజ ధొలో



భువనేశ్వర్: రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్‌ఆర్‌సీ)గా 1993 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి నికుంజ బిహారీ ధొలా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే విపత్తు నిర్వహణ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆయన ఒడిశా విద్యుత్‌శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్, గ్రిడ్కో, ఒడిశా స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో భాగవత పారాయణం



బాబా పాదుకలు, గురూజీ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



షిర్డీసాయి గురు భాగవత పారాయణం చేస్తున్న భక్తులు

కొరాపుట్: షిర్డీసాయి గురు భాగవత పారాయణం కార్యక్రమాన్ని నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని చైనా మార్కెట్ జంక్షన్‌లో ఉన్న మందిరంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ చంద్రభాను శత్పతి రచించిన సాయి భగవతాన్ని అతని అనుచరులు పఠించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన చంద్రదత్త మిశ్రా(సోనేపూర్), దీపాలి పాఢి(సోనేపూర్), అర్జున్ నందా(ఝార్సుగుడ), అవనీ దాస్(బ్రజ్‌రాజ్‌నగర్), ప్రవీణ్ పతి(బ్రజ్‌రాజ్‌నగర్) భక్తులకు బోధించారు. నవరంగ్‌పూర్ షిర్డీసాయి కమిటీ ఆధ్వర్యంలో 150 గ్రంథాలను భక్తులకు పంపిణీ చేశారు. అంతకుముందు బాబా పాదుకలు, గురూజీ చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాదేటి కృష్ణ, కొత్తకోట శ్రీను, అమనాన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

చతుర్ధా మూర్తులకు చచేరి అలంకరణ

భువనేశ్వర్: శ్రీమందిరంలో డోలో పూర్ణిమ యాత్ర ప్రారంభమైంది. స్వామికి ఏటా నిర్వహించే 12 యాత్రలలో డోలో పూర్ణిమ యాత్ర ఒకటిగా నీలాద్రి మహోదయ వసంత్ గుండిచా వ్యాఖ్యానంలో పేర్కొంది. చచేరి అంటే వేడుక. గీతవాద్యాలు(గానా బజానా), హాస్య ఉల్లాసంతో జరుపుకొనే ఉత్సవమిది. స్వామివారిని చచేరి అలంకరణలో దర్శిస్తే అఖండ శాంతి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ఈ యాత్ర నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమం ఖరారు చేశారు. ఫాల్గుణ శుక్ల దశమి నుంచి పూర్ణిమ వరకు రత్న వేదికపై మూల విరాట్‌లకు చచేరి అలంకరణ చేస్తారు. ఈ సందర్భంగా నివేదించే ప్రసాదం చచేరి భొగ్గొ అని పేర్కొంటారు. ఫొగ్గు(సుగంధిత రంగుపొడి) విరజిమ్మి స్వామికి చచేరి సేవ నిర్వహిస్తారు. జగన్నాథ వల్లభ మఠం ప్రత్యక్ష పర్యవేక్షణలో డోలో పూర్ణిమ యాత్ర జరుగుతోంది.



చచేరి అలంకరణలో చతుర్ధా మూర్తులు

క్లుప్తంగా

దోపిడీ దొంగలు అరెస్ట్

● బంగారం, పల్సర్ బైక్ స్వాధీనం



హింజిలికాట్ పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: గంజాం జిల్లా గొకస్‌పూర్ గ్రామంలో జరిగిన దోపిడీ ఘటనలో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను హింజిలికాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12.29 గ్రాముల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి బసంత్‌కుమార్ సెతి తెలిపిన వివరాల ప్రకారం 2రోజుల క్రితం గొకస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రమోద్‌కుమార్ పాణిగ్రహి ఇంటి గేటు విరగ్గొట్టిన దుండగలు బీరువా లోని బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు దోచుకొని పరారయ్యారు. ఘటనపై బాధితుడు హింజిలికాట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు.

నా బిడ్డ పరిస్థితేంటి ?



వన్‌టౌన్ సీఐ వెంకటరావుకు ఫిర్యాదు చేస్తున్న పుష్పలత

విజయనగరం క్రైమ్: తన బిడ్డ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ విజయనగరానికి చెందిన అడ్వకేట్ తమ్ముడి భార్య పుష్పలత వన్‌టౌన్ పోలీసులను గురువారం ఆశ్రయించి, ఫిర్యాదుచేసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకట్రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్వొకేట్ తమ్ముడి భార్య పుష్పలత కొన్నాళ్ల కిందటే వాళ్ల చెర నుంచి తప్పించుకుని బయటకు వచ్చేసింది. కానీ ఆమె బిడ్డ అక్కడే ఉండిపోయింది. ఇప్పుడు తాజాగా అడ్వొకేట్ మధుసూదనరావు భార్య సుప్రియకు మెజిస్ట్రేట్, పోలీస్‌శాఖ సహకారంతో విముక్తి లభించిన సంగతి విదితమే. సుప్రియ కూడా బయటకు రావడంతో తన బిడ్డ పరిస్థితేమిటన్నది పుష్పలతకు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో గురువారం ఆమె వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావును కలిసి తన గోడు వెళ్లగక్కి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అయితే కోర్టుద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సీఐ సూచించడంతో ఆమె జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

దాడితల్లి సేవలో ఎమ్మెల్యే దంపతులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో దాడితల్లి ఆలయ గర్భాలయ గోపుర ప్రతిష్ట గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, పూర్ణకలశ ప్రతిష్ట, మండపారాధనలు నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సతీసమేతంగా పూజల్లో పాల్గొని, దైవం పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్స్‌గా ఉద్యోగోన్నతి



ఉద్యోగోన్నతి పొందిన వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 8 మందికి ప్రభుత్వం అసోసియేట్ ప్రొఫెసర్లగా ఉద్యోగోన్నతి కల్పించింది. వారికి రిలీవింగ్ ఆర్డర్స్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు గురువారం అందజేశారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో డాక్టర్ కె.కె.ఎల్ ప్రసాద్ (కమ్యూనిటీ మెడిసిన్ విభాగం), డాక్టర్ చౌదరి బాలాజీ(పెథాలజీ), డాక్టర్ తారకలక్ష్మి (ఫిజియాలజీ)లను విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీకు బదిలీ చేశారు. డాక్టర్ శరత్ నాయక్ (కమ్యూనిటీ మెడిసిన్) విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలకు, డాక్టర్ వినుత (ఫామ్‌కాలజీ) విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీకి, డాక్టర్ పి.కుసుమకుమారి, పీవీఎస్ఎస్ విజయబాబు (బయోకెమిస్ట్రీ)లను శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలకు, జి.సూర్యనారాయణ (డెర్మాటాలజీ)ను రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు.

గ్యాస్ ధర పెంపుపై సర్వత్రా నిరసన

● అచ్చే దిన్ కల్ల: సమాజ్‌వాదీ పార్టీ
● ఇల్లాలి కంట తడి సహించేది లేదు: బీజేడీ
● హెచ్చు తగ్గులు సాధారణమే: బీజేపీ



రాజ్‌భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు

భువనేశ్వర్: 'అచ్చే దిన్' నినాదంతో ప్రజలను కలలో తేలియాడించి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కలలను కల్ల చేసిందని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్రశాఖ ఆరోపించింది. గ్యాసు ధరల పెరుగుదల పట్ల సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రవి బెహరా ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ఎదుట గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన పగ్గాలు చేపట్టిన నుంచి ప్రజలను కేంద్రప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. పేదలు, దిగువ, మధ్య తరగతి వర్గీయులు తరచూ పెరుగుతున్న నిత్యావసర సరుకులు, సామగ్రి ధరల పెరుగుదలతో సతమతం అవుతున్నారన్నారు. ద్రవ్య సేవా పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత ద్రవ్యోల్బణం అదుపు తప్పిందని, జాతీయ స్థాయిలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. సాధారణ వంట గ్యాస్ సిలీండర్ ధర రూ.50, వాణిజ్య వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.350 చొప్పున భారత ప్రభుత్వం పెంచడం దారుణమన్నారు. ధరల పెంపు కేంద్రప్రభుత్వం దేశ ప్రజలకు హోలీ కానుకగా అందించిందని ఎద్దేవా చేశారు. నిరసనలో పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ప్రధాన్, మహిళా నాయకురాలు రీతా పట్నాయక్, కోశాధికారి సంజయ్ నాయక్, విద్యార్థి సంఘం నాయకులు ఓంప్రకాష్ దాస్, మేజర్ సౌమ్యరంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రెట్లు పెంచారు..

ధర పెంపుపై ఖండపడా నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేడీ నాయకుడు సౌమ్యరంజన్ పట్నాయక్ కేంద్ర ప్రభుత్వంపై తీరుపై మండిపడ్డారు. భువనేశ్వర్‌లోని బీజేడీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ ధర రూ.50 పెంచి నాలుగున్నర కోట్ల మంది ఒడియా ప్రజలపై కేంద్రప్రభుత్వం భారం మోపిందన్నారు. ఈ చర్య పట్ల బిజూ జనతాదళ్ మౌనంగా ఉండేది లేదని హెచ్చరించారు. 2014లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉజ్వల యోజన ప్రవేశపెట్టి ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్ మంజూరు చేశారని, అయితే ధరలు మాత్రం 3రెట్లు పెంచి, సామాన్యుడి బతుకు భారం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. గత ఎనిమిదేళ్లలో గ్యాస్ సిలీండర్ ధర రూ.450 నుంచి రూ.1,145 లకు పెంచడం దారుణమన్నారు. గృహిణుల కంట తడి తొలగిస్తామని అమలు చేసిన పథకం.. వారి పాలిట శాపంగా మారిందని దుయ్యబట్టారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించు కోకపోతే.. బీజేడీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు.



బీజేడీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్



విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ చరణమాఝి

బీజేడీది అవకాశవాద రాజకీయం..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరగడంతో దేశంలో వంటగ్యాస్ ధర రూ.50లు పెరిగిందని బీజేపీ చీఫ్ విప్ మోహన్‌చరణ్ మాఝి తెలిపారు. ధరల హెచ్చు తగ్గులు సాధారణమేనని వ్యాఖ్యానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను ఇబ్బంది పెట్టడం లేదని, ధరలు మళ్లీ తగ్గుముఖం పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ధరల నియంత్రణపై బీజేడీ రాజకీయం చేస్తోందని, వారిది అవకాశవాదమని విమర్శించారు. రాజకీయ లబ్ధి కేసుమే కేంద్రంపై నిందలు మోపుతున్నారు మినహా.. ప్రజలపై ప్రేమతో కాదని వివరించారు.

ఒలీవుడ్ నటుడు పింటూ నందా మృతి

● సంతాపం ప్రకటించిన గవర్నర్, సీఎం



ఆస్పత్రిలో పింటూ నందా



పింటూ నందా(ఫైల్)

భువనేశ్వర్: ప్రముఖ ఒడియా చలనచిత్ర నటుడు పింటూ నందా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా కాలేయ సిరోసిస్‌తో బాధపడుతున్నారు. వైద్యులు కాలేయ మార్పిడికి సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులు ఢిల్లీలోని చికిత్స పొందారు. ఉన్నత చికిత్స కోసం వారం క్రితం హైదరాబాద్‌కు తరలించారు. న్యూఢిల్లీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్(ఐఎల్‌బీఎస్)లో దాతలు అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. కుటుంబ సభ్యుడు పింటుకు కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చినా, రక్త నమూనాలు సరిపోలక పోవడంతో సాధ్యం కాలేదు. ఇంతలో ఆరోగ్యం క్షీణించగా, మరో దాతను ఏర్పాటు చేసేలోగానే బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, సీఎం నవీన్ పట్నాయక్ పింటూ నందా మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు దైవ సన్నిధిలో సముచిత స్థానం లభించాలని గవర్నర్ సంతాప సందేశం జారీ చేశారు. 'ఒడియా చలన చిత్ర ప్రపంచంలో ప్రముఖ నటుడు పింటూ నందా మరణం వార్త విని చాలా బాధపడ్డాను. సినిమాలు, సీరియల్స్‌లో తన విభిన్నమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబ సభ్యుల పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నా'నని ముఖ్యమంత్రి ట్విటర్‌లో ప్రకటించారు.

గుణుపూర్ ఐటీడీఏకు బహుమతి



మంత్రి సరక చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న పీఓ బారల్

రాయగడ: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఆదివాసీ మేళాలో గుణుపూర్ ఐటీడీఏకు బహుమతి లభించింది. బుధవారం ముగిసిన ఈ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక చేతుల మీదుగా ఐటీడీఏ పీఓ జయప్రకాష్ బారల్, వందన వికాష్ కేంద్ర అధికారి భైరవకుమార్ స్వాయి ఈ బహుమతిని అందుకున్నారు. ఈ మేళాలో రాష్ట్రంలోని 21 ఐటీడీఏల పరిధిలో ఆదివాసీల జీవనం, వారి సంప్రదాయం, సంస్కృతులను అద్దంపట్టే విధంగా కుటీరాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా స్థానిక ఐటీడీఏ గుణుపూర్ పరిధిలో నివసించే ఆదిమ జాతి లంజియా సవర జీవిత విశేషాలు, వారి భాష, సంస్కృతులకు అద్దం పట్టే విధంగా కుటీరాన్ని ఏర్పాటు చేసింది. పూరి గుడిసె గోడలను పేడతో అలికి, అందంగా వారి సంప్రదాయ ఇడితాల్ చిత్రాలను వేశారు. గోడలపై ఇడితాల్ చిత్రాలను లక్ష్మణ సాబొరొ చిత్రీకరించగా, సబ్ డివిజన్ పరిధిలోని సోగొడ గ్రామానికి చెందిన లంజియా తెగ ఆదివాసీలు ఈ కుటీరాన్ని నిర్మించారు. సందర్శకులను ఈ కుటీరం ఆకర్షించడంతో గుణుపూర్ ఐటీడీఏ ఉత్తమ బహుమతి గెలిచినట్లు ప్రకటించారు.



ప్రదర్శనలో ప్రశంసలందుకున్న కుటీరం ఇదే

లక్ష్యం పైనే గురిపెట్టాలి



ఉత్తమ విద్యార్థికి అవార్డు అందిస్తున్న హెచ్‌ఎం సామినేని మణిమాల

● హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్ ప్రధాన్
● ఘనంగా మహారాజా బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవానికి హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

పర్లాకిమిడి: మహాభారతంలో అర్జునుడు తరహాలో పదో తరగతి విద్యార్థులు లక్ష్యం పైనే గురి పెట్టాలని, అప్పుడే విజయం సొంతమవుతుందని మహారాజా బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్ ప్రధాన్ అన్నారు. పట్టణంలోని మహారాజా బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మార్చి 10నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులంతా పూర్తి సన్నద్ధతతో వ్యవహరించాలని సూచించారు. ఉపాధ్యాయులు జగన్నాథ పట్నాయక్, జిల్లా 5టీ కో-ఆర్డినేటర్ వై.ధర్మారావు, ఎంఆర్ బాయ్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు చెట్టి వేంకటేశ్వర్లు, హెచ్‌ఎం(ఇన్‌చార్జి) డి.శ్రీరామ్మూర్తి, క్రీడాధికారి ఎస్.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఏటా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే వారికి అందించే సామినేని ప్రభాకర్ అవార్డును 2022 ఏడాదికి గాను విద్యార్థులు కోట్ల వంశీ, సాగర్ మల్లిక్, నృసింహనాథ్ అవార్డును దీపక్ పండాకు, మదన్‌మోహన్ పట్నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సామినేని మణిమాల, ఉపాధ్యాయులు జగమోహన్ పాత్రొ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పాచిపెంట: మండలంలోని కన్నయ్యవలస గ్రామానికి చెందిన సోయారి ఆదయ్య విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గతనెల 25వతేదీన చెట్టుపై నుంచి జారిపడి ఆదయ్య తీవ్రగాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి అదే రోజు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో మరో యువకుడు..

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బొగ్గుల దిబ్బ ఎస్సీ కాలనీకి చెందిన మామిడి ఉదయ్ కుమార్ (19) బుధవారం రాత్రి బైక్‌పై స్నేహితుడితో వస్తుండగా కెఎల్.పురంలోని జేఎంఎస్ కల్యాణ మంటపం సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఉదయ్‌ను కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.వెంకటరావు తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

బొండపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఏడు ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుకను మండలంలోని నెలివాడ జంక్షన్ సమీపంలో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గజపతినగరం మండలం మీదుగా జాతీయ రహదారి26పై గురువారం సాయంత్రం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా అడ్డుకుని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించనున్నామన్నారు.

ఆహార పదార్థాల తయారీ తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణంలోని వివిధ హోటల్స్, మిఠాయి దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో జిల్లా ఆహార భద్రతాధికారులు గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధించిన రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ను వాడకూడదని ఆహార భద్రత అధికారి పి. వెంకట రమణ హెచ్చరించారు. కాచిన నూనెలలో టీపీసీ(టోటల్ పోలార్ కాంపౌండ్స్)ను పరిశీలించి దుకాణదారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వంట నూనెలు అతిగా మరగకాచడం వల్ల ఉదరకోశ వ్యాధులు వస్తాయని స్పష్టం చేశారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామం సమీపంలో జాతీయ రహదారి26పై గురువారం ఉదయం వేగంగా వస్తున్న కారు ఆగి ఉన్న వాహనాలపైకి ఒక్కసారిగా దూసుకెళ్లడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వైపు వస్తున్న కారు టిఫిన్ సెంటర్ వద్ద ఆగి ఉన్న ఆటోతో పాటు మోటార్ సైకిల్‌పైకి దూసుకెళ్లడంతో ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కె.చంద్రరావు, ఆటోలో వెళ్తున్న డ్రైవర్ వి.వెంకటరమణ, కూతురు వి.లికిత శ్రీ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

విజయనగరం రూరల్:

కార్పొరేషన్ పరిధిలోని పూల్‌బాగ్ కాలనీలో అక్రమంగా నిల్వచేసిన పీడీఎఫ్ బియ్యాన్ని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన బత్తుల సంతోష్‌కుమార్ కిరాణా దుకాణం వద్ద 9.48 క్వింటాల పీడీఎఫ్ బియ్యం నిల్వ ఉన్నాయన్న సమాచారం అందుకున్న సీఎస్‌డీటీ జగన్నాథరావు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

8 గ్యాస్ సిలిండర్లు..

మండలంలోని చెల్లూరు గ్రామంలో గల కామత్ హోటల్లో పౌరసరఫరాల అధికారులు, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి గృహ అవసరాలకు వినియోగిస్తున్న 8 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అధికారుల తనిఖీ సమయంలో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడాన్ని గుర్తించారు. అలాగే బొడ్డవలస మూన్‌లైట్ దాబాలో ఐదు సిలిండర్లు, ఐనాడ వద్ద ఆరు, సిలిండర్లను గుర్తించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, విజయనగరం సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథం, విజిలెన్స్ కానిస్టేబుల్ పురుషోత్తం, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఇన్‌చార్జ్ ఏఈ సస్పెన్షన్

విజయనగరం ఫోర్ట్:

బొబ్బిలి డి-2 సెక్షన్ జూనియర్ ఇంజినీర్, ఇన్‌చార్జి ఏఈ జి.శివశంకర్‌రావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎస్ఈ పి.నాగేశ్వరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎవరికైనా విద్యుత్ పోల్ కావాలంటే నిబంధనల ప్రకారం రూ.1,28,451 చెల్లించాల్సి ఉంది. విద్యుత్ పోల్‌ను తరలించాలంటే దానికి సంబంధించి ఎస్టిమేట్, తరలించడానికి చార్జీలకు సంబంధించి ఎస్టిమేట్ వేసి ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యుత్ పోల్‌కు సంబంధించిన పేమెంట్ సదరు వ్యక్తి చెల్లించిన తర్వాత, ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని పోల్ తరలించాలి. కానీ ఇన్‌చార్జ్ ఏఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయకుండా..నిబంధనలకు విరుద్ధంగా బొబ్బిలిలోని సాహితినగర్‌లో ఉంటున్న మరడా శంకర్‌రావుకు 33 కేవీ పోల్‌ను అనధికారికంగా తరలించారు.అంతేకాకుండా పోల్ తరలించే సమయంలో ఉదయం 10:06 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేసి వినియోగదారులకు ఇబ్బంది కలిగించారు. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

ఘనంగా ఖాదర్ బాబా గంధ మహోత్సవం



మహాన్నదాన క్రతువు ప్రారంభిస్తున్న డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్




ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: సూఫీ మహాత్మా హజరత్ షరీఫ్ ఖాదర్‌వలీ బాబా 64వ గంధ మహోత్సవం స్థానిక బాబామెట్టలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. నభీబుల్ ఔలియా సూఫీ పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా ఖాదరీ బాబా ఆధ్యాత్మిక వారసులు సజ్జాద నషీన్ మహమ్మద్ ఖాజా మెహియుద్దీన్ షా, విజయనగరం ఖాదరి బాబా దర్గా దర్బార్ ముతవల్లి డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, ఎం.డి జాఫర్ షరీఫ్‌లు ఉర్సు మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్బార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫకీర్ మేళాలతో ఊరేగింపుగా బాబా చాదర్, సుగంధ పరిమళ ద్రవ్యాలతో, పూలమాలలతో బాబా దర్గాకు భక్తుల కోలాహలం మధ్య బయల్దేరారు. అక్కడ చాదర్ సమర్పించి, ఉరుసు ఉత్సవాల ప్రారంభ సూచికగా జెండా మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజలు, మహాన్నదాన క్రతువు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని, బాబా ప్రసాదాన్ని స్వీకరించారు.

పెండింగ్ పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలి

● నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక



పాల్గొన్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: పెండింగ్‌లో ఉన్న పోక్సో, గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిందితులకు 41 సీఆర్‌పీసీ నోటీసులిచ్చే సమయంలో సుప్రీంకోర్టు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కొన్నింటిని ప్రాధాన్యత కేసులుగా గుర్తించి, ఆయా కేసుల్లో ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి, నిందితులకు తప్పనిసరిగా, త్వరగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దిశ మహిళా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేశవరావు సీఐలు, ఎస్సైలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమృత్ సరోవర్ పూర్తి చేయాలి



అమృత్ సరోవర్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

గార: మార్చి నెలాఖరు నాటికి అమృత్ సరోవర్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం వత్సవలస పంచాయతీ ఆమదాలపాడు పాత చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వేతనదారుకు రోజుకు గరిష్టంగా రూ.250 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేతనాల ఆధారంగానే నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, ఏపీఓ సీహెచ్ సంధ్యారాణి, తెలుకోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ బ్లాకులు పట్టివేత



టెక్కలి మైన్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ బ్లాకులు

టెక్కలి: మండలంలోని మేలిసతివాడ నుంచి అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ బ్లాకులను గురువారం టెక్కలి మైన్స్ అధికారులు పట్టుకున్నారు. మైన్స్ ఏజీ కుమారస్వామి, సిబ్బంది మాటువేసి వీటిని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సరైన సమాధానం చెప్పకపోవడంతో వాహనంతో పాటు బ్లాకులను టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, మేలిసతివాడ సమీపంలోని సాయి అమృత గ్రానైట్ క్వారీ నుంచి ఈ బ్లాకులను తరలిస్తున్నట్లు సమాచారం.

వైభవంగా చక్రధరుని గరుడ వాహనసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న చక్రధర పెరుమాళ్‌స్వామి

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలలో భాగంగా గురువారం గరుడవాహన సేవ కమనీయంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామవీధుల్లో శ్రీదేవీ భూదేవీ సమేత చక్రధర స్వామికి శాస్త్రోక్తంగా గరుడవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల కృష్ణారావు, శ్రీరాంబాబు, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు వృద్ధులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గ్రామంలో పిచ్చికుక్క హడలెత్తిస్తోంది. ఊరిలో స్వైర విహారం చేస్తూ పోలాకి లచ్చమ్మ, దాసరి శివరాం, కొర్నాన పుణ్యావతి అనే ముగ్గురు వృద్ధులపై దాడి చేసిందని స్థానికులు తెలిపారు. అలాగే అల్లాడ కొండరావు, కోనారి బారికిరావులకు చెందిన మూగ జీవాలపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో క్షతగాత్రులను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిని వైఎస్సార్ సీపీ నాయకులు మనుమంతు రామ్మోహన దొర, డబ్బీరు భవానీ పరామర్శించారు.

కోటబొమ్మాళిలో మహిళా మార్ట్ ఏర్పాటు



కోటబొమ్మాళిలో భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

కోటబొమ్మాళి: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కోటబొమ్మాళి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలతో కొత్తగా మహిళా మార్టును ఈనెల 16వ తేదీ తర్వాత ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ తెలిపారు. ఆయన గురువారం కోటబొమ్మాళిలో ఏర్పాటు చేయనున్న మహిళా మార్టు భవనాన్ని పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే శ్రీకాకుళం, నరసన్నపేటలో మార్టులు ప్రారంభించామని, డ్వాక్రా మహిళలు చక్కగా నడుపుతున్నారని తెలిపారు. కోటబొమ్మాళిలో డీఆర్‌డీఏ భవనం అనుకూలంగా ఉందన్నారు. అనంతరం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమీక్ష నిర్వహించారు.

- పరిశ్రమలకు స్వర్గధామం.. శ్రీకాకుళం
- అందుబాటులో వేలాది ఎకరాల భూములు
- పుష్కలంగా మంచినీరు, రవాణా వనరులు
- గ్లోబల్ సమ్మిట్‌పై ఆశలు
- పెట్టుబడులు వస్తాయని ఎదురుచూపు
- జిల్లా పరిస్థితులపై ప్రత్యేక డాక్యుమెంటరీ తయారీ



పైడిభీమవరంలో ఫార్మా పరిశ్రమలు

పరిశ్రమలు ప్రాప్తిరస్తు

సువిశాలమైన సాగరతీరం.. దాని వెంబడి ఏర్పాటవుతున్న పోర్టులు.. బీచ్ శాండ్ మినరల్స్, గ్రానైట్, ఇతర విలువైన ఖనిజ వనరులు.. రైల్, రోడ్డు, సీ కనెక్టివిటీ.. త్వరలో ఏర్పాటుకానున్న భోగాపురం విమానాశ్రయం.. అపారమైన మత్స్య సంపద.. పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు.. అన్నింటికీ మించి భూ సంపద, మానవ శక్తి... వెరసి ఎన్నో రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్న జిల్లా సిక్కోలు. ఇప్పటికే ఎన్నో భారీ మధ్య చిన్న తరహా పరిశ్రమలు ఉన్న జిల్లాలో పారిశ్రామికవేత్తలకు అక్షయపాత్రలాంటిది అనడంలో సందేహం లేదు. ప్రభుత్వ ప్రోత్సాహం వీటిని సద్వినియోగించుకుంటే జిల్లా పారిశ్రామిక స్వర్గంగా మారుతుందనడంలో సందేహం లేదు. సరిగ్గా ఇటువంటి ఆలోచనే చేస్తోంది జిల్లా అధికార యంత్రాంగం. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నేపథ్యంలో జిల్లా వనరులు, అవకాశాలను వివరిస్తూ ఒక డాక్యుమెంటరీని రూపొందించింది. దాన్ని సమ్మిట్‌లో పాల్గొనేవారికి చూపించి పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్... విశాఖలో నేటి నుంచి నిర్వహిస్తున్న అరుదైన కార్యక్రమం. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న ఈ సమ్మిట్‌పైనే జిల్లా కూడా కోటి ఆశలు పెట్టుకుంది. దేశ, విదేశాల్లోని పారిశ్రామిక దిగ్గజాలు వస్తుండడంతో వారి చూపు శ్రీకాకుళం వైపు పడుతుందని ఆశ పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే ఫార్మా, జీడి పరిశ్రమలు ఉన్నాయి. మరిన్ని పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని అర్హతలు శ్రీకాకుళానికి ఉన్నాయి.

పారిశ్రామిక మణిహారం..



జిల్లా పారిశ్రామిక మణిహారంగా పైడి భీమవరం ఉంది. సిక్కోలు పారిశ్రామిక ప్రగతి చూడాలంటే జిల్లాకు స్వాగతం పలుకుతున్న పైడిభీమవరంలోని పరిశ్రమలు చూస్తే చాలు. ఇక్కడ రెడ్డీస్, అరబిందో,ఆంధ్రా ఆర్గానిక్స్ వంటి సంస్థలు ఉన్నాయి. వీటి విస్తరణకు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇక్కడ వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. మన జిల్లానే కాదు కాదు పొరుగున్న విజయనగరం, విశాఖపట్నంకు చెందిన వారు కూడా వీటిలో పనిచేస్తున్నారు. ఇక్కడ దాదాపు 400 ఎకరాలతో ఫార్మా క్లస్టర్ నడుస్తోంది.

మరో 1200 ఎకరాల్లో..



కొత్త పరిశ్రమల రాక కోసం ఇక్కడ 1200 ఎకరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. సంచాం, చిట్టివలస, నరవ గ్రామాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఏపీఐఐసీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇక్కడున్న పరిశ్రమల కోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించింది. క్వాలిటీ మంచినీటిని అందించేందుకు డీ శానిటేషన్ ప్లాంట్‌ను అభివృద్ధి కూడా చేసింది. నాణ్యమైన విద్యుత్‌ను కూడా అందిస్తోంది.

తెల్ల బంగారం పరిశ్రమల కోసం..



తెల్లబంగారంగా చెప్పుకునే జీడి పిక్కల పరిశ్రమలకు పలాస-కాశీబుగ్గ కేరాఫ్ అడ్రస్. ఇక్కడ 31 ఎకరాల్లో జీడి పప్పు క్లస్టర్ ఉంది. ఇప్పటికే ఇక్కడ 200 పరిశ్రమలు ఉన్నాయి. దేశ, విదేశాలకు ఇక్కడ జీడిపప్పు ఎగుమతి అవుతోంది. ఇక్కడున్న డిమాండ్, అవకాశాల దృష్ట్యా కాశీబుగ్గకు సమీపంలోని రామకృష్ణాపురంలో 66 ఎకరాలను సేకరించి ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక వాడ అభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఇది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా చెబుతారు.

సంతబొమ్మాళిలో 1500 ఎకరాలు సిద్ధం..



టెక్కలి, కోటబొమ్మాళి, మెళియాపుట్టిలో గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. దాదాపు 150 పరిశ్రమలు నడుస్తున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. విలువైన గ్రానైట్ తవ్వకాలు జరిగి, దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. సంతబొమ్మాళిలో పరిశ్రమల కోసం సుమారు 1500 ఎకరాలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న భారీ పరిశ్రమలు	:	20
వీటి పెట్టుబడి	:	రూ. 11,469 కోట్లు
కొత్తగా నిర్మాణంలో ఉన్న భారీ, మధ్య తరహా పరిశ్రమలు	:	7
కొత్తగా నిర్మిస్తున్న వాటి పెట్టుబడి	:	రూ. 6,040 కోట్లు
అదనంగా ఉపాధి పొందే వారి సంఖ్య	:	13,600
జిల్లాలో ప్రస్తుతం ఉన్న చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలు	:	5813
వీటి పెట్టుబడి	:	రూ. 628.35 కోట్లు
ఉపాధి పొందుతున్న వారి సంఖ్య	:	43,453

జిల్లాలో ఉన్న పారిశ్రామిక వాడలు :
పైడి భీమవరం, శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, బలగ

జిల్లాకున్న అడ్వాంటేజ్..

ఏ ప్రాంతమైనా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే నీటి నిల్వలు అవసరం. మన జిల్లాలో పుష్కలంగా ఉన్నాయి. దానికి వంశధార, నాగావళి, మహేంద్ర తనయ, బహుద వంటి నదులే కారణం.


- పరిశ్రమలకు అవసరమైన నీరు అందించగల సామర్థ్యం జిల్లాలోని నదులకు ఉంది.
- మరోవైపు 193 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. మత్స్య సంపదకు అనువైన ప్రాంతమిది.
- ఆక్వా ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రదేశంగా తీసుకోవచ్చు. దానికి తగ్గట్టుగానే ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది.
- గ్రానైట్, జీడి ఎగుమతులతో పాటు మత్స్య సంపద ఎగుమతులకు ఉపయోగపడేలా భావనపాడులో ప్రత్యేకంగా పోర్టును నిర్మిస్తోంది. త్వరలోనే పోర్టు పనులకు శంకుస్థాపన చేయనుంది.
- జిల్లాలో 172 కిలోమీటర్ల పొడవున 16వ నంబర్ గల జాతీయ రహదారి ఉంది. ఆరు లైన్ల విస్తరణ పూర్తయ్యి ఇటు కోల్‌కత్తా, అటు చెన్నై, తెలంగాణకు అందమైన రోడ్లు ఉన్నాయి. అలాగే రైల్వే మార్గం ఉంది.
- జిల్లా ముఖద్వారమైన పైడి భీమవరానికి 30 కిలోమీటర్ల దూరంలోని భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో నిర్మించనున్నారు.
- జిల్లాలో 3,330ఎకరాల అన్ డెవలప్డ్ ల్యాండ్ ఉంది. అలాగే, జిల్లా వ్యాప్తంగా పారిశ్రామిక అవసరాల కోసమని 5400 ఎకరాలు సేకరించి యంత్రాంగం సిద్ధంగా ఉంచింది. ఇవన్నీ పరిశ్రమల స్థాపనకు దోహదపడే సానుకూల అంశాలు. వీటిన్నింటిపైనా జిల్లా యంత్రాంగం ఒక డాక్యుమెంటరీ కూడా రూపొందించింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేలా ఆ వీడియో ఉంది.



చేతిలో కెమెరాతో శ్రీనివాస్

- సిక్కోలు చరితను నిక్షిప్తం చేస్తున్న ఇంటాక్ ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్
- వందలాది చారిత్రక స్థలాల ఫొటోలతో ప్రదర్శనలు
- ఇంటాక్‌లో శాశ్వత సభ్యత్వం

చరిత భద్రం..



ఎ స్టోరి ఆన్ స్టోన్ ఆఫ్ శ్రీకాకుళం పుస్తకం

శ్రీకాకుళం కల్చరల్:

అరసవల్లి ఆలయం అందరికీ తెలుసు. కానీ అక్కడి శిలా శాసనాలు ఎప్పుడైనా గమనించారా..? బారువ వద్ద ఓ షిప్ మునిగిపోయిందని జిల్లా అంతటికీ తెలుసు. కానీ భావనపాడు, పోలాకి వద్ద కూడా మరో రెండు షిప్పులు ఇసుక దిబ్బల మధ్య సమాధైపోయాయని తెలుసా..? శ్రీకూర్మంలో ఆకుపసర చిత్రాలు చూసే ఉంటారు. టెక్కలి రాజస్థానంలో మొరాల్ పెయింటింగ్స్ ఎన్నడైనా చూశారా..? ఎస్‌ఎం పురం అంటే షేర్ మహ్మద్ పురం అని వినే ఉంటారు. ఆ పురంలోని ప్యాలెస్‌లో అతిపెద్ద దిగుడు బావి గురించి విన్నారా..? ఇలా తెలిసిన సిక్కోలు చరిత్ర మాటున తెలియని విషయాలు చాలా ఉండిపోయాయి. ఆ రహస్యాలను, ఆయా ప్రాంతాలు దాచుకున్న జ్ఞాపకాలను ఫొటో తీసి భవిత కోసం భద్రపరుస్తున్నారు మండా శ్రీనివాసరావు. ఇంటాక్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన నిక్షిప్తం చేస్తున్న చిత్రాలు సజీవ సిక్కోలు చరిత్రకు తార్కాణాలు. ఓ వైపు ఇండియన్ బ్యాంక్‌లో పనిచేస్తూ మరోవైపు కెమెరా భుజాన వేసుకుని గత కాలపు గురుతులను క్లిక్‌మనిపించే శ్రీనివాసరావు ఎన్నో ఫొటో ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. అందుకు ప్రతిఫలంగా ఇంటాక్(భారత జాతీయ సంస్కృతి కళ వారసత్వ సంపద పరిరక్షణ సంస్థ)లో శాశ్వత సభ్యునిగా గుర్తింపు పొందారు.

శ్రీకాకుళంలోనే నివాసం ఉండే శ్రీనివాసరావు ఎమ్మెస్సీ చదివారు. మృదంగంలో డిప్లమో కూడా తీసుకున్నారు. 1992 నుంచి ఇండియన్ బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఫొటోగ్రఫీ అంటే ఇష్టమున్న శ్రీనివాసరావును 2005లో ఇంటాక్ కన్వీనర్ దూసి ధర్మారావు గమనించారు. అప్పటి నుంచి ఆ కెమెరా కళ్లతో జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను ఫొటోలు తీయించి నిక్షిప్తం చేయించారు. ఈ చిత్రాలతో ఇంటాక్ తరఫున 100కుపైగా ఫొటో ప్రదర్శనలు నిర్వహించారు. 2006లో మొదటిసారిగా ఇంటాక్ తరఫున ఒక బ్రోచర్‌ను 'గ్లాన్స్ ఎట్ ఏ గ్లోరియస్ శ్రీకాకుళం' పేరుతో రూపొందించారు. జిల్లాలో పర్యాటక స్థలాలను తెలుపుతూ ఓ మ్యాప్ కూడా రూపొందించారు.

ఎన్నెన్నో అందాలు..

తేలుకుంచి, తేలినీలాపురం, గుళ్లసీతారాంపురం, మెట్టుగూడ పాల్స్(సీతంపేట), షేర్‌మహ్మద్‌ఖాన్ ప్యాలెస్‌లో అతిపెద్ద దిగుడుబావి, అరసవల్లిలోని శిలాశాసనాలు వంటివి ఈ అరుదైన చిత్రాల్లో ఉన్నాయి. టెక్కలిలో అప్పటి రాజస్థానంలోని మొరాల్ పెయింటింగ్స్, అలాగే టెక్కలి సమీపంలో 5 గుహలు, పోలాకి మండలం జోగంపేట వద్ద మునిగిపోయిన షిప్పు, అక్కడ ఇప్పటికీ జరుగుతున్న పూజలు, బారువ వద్ద మునిగిపోయి షిప్, బారువా వద్ద కృష్ణదేవరాయలు జనార్దన స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన గంట, భావనపాడు హార్బర్ వద్ద మునిగిపోయిన షిప్ వంటివన్నీ ఈయన రికార్డు చేసిన చిత్రాల్లో ఉన్నాయి. ఈ చారిత్రక స్థలాలతో 'ఎ స్టోరి ఆన్ స్టోన్ ఆఫ్ శ్రీకాకుళం' పేరుతో పుస్తకాన్ని కూడా రూపొందించారు. ఈ వివరాల సేకరణ తనకెంతో తృప్తినిస్తుందని ఆయన చెబుతారు. మద్రాస్ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్య భారత గౌరవ స త్కారం, మాల్‌పల్లి పూజా కమిటీ కోల్‌కత్తా వారి నవరత్న అవార్డు వంటివి అందుకున్నారు.

పోలీసుల సహకారంతోనే ఉత్సవాలు

ఇచ్ఛాపురం: స్థానిక గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలను పోలీసుల సహకారంతోనే వైభవంగా నిర్వహించడం సాధ్యమవుతుందని గ్రామ పెద్దలు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అన్నారు. అమ్మవారి ఆలయంలో పట్టణ పోలీసులతో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీ నుంచి నెల రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు అవసరమైన సహకారం అందించాలని పోలీసులను కోరారు. సీఐ ఆర్‌ఈసీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉత్సవాల దృష్ట్యా 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఒక కంట్రోల్ రూమ్‌ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాలు జరిగే నెల రోజులు పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూట్‌మ్యాప్ సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల సాధనలో నైపుణ్యాలు కీలకం



మాట్లాడుతున్న ఏయూ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ పాల్‌డగ్లస్

ఎచ్చెర్ల క్యాంపస్: పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు తప్పనిసరిగా పెంచుకోవాలని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ పాల్ డగ్లస్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలులో ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రేరణ తరగతుల్లో భాగంగా రెండో రోజు గురువారం పాల్‌డగ్లస్ ప్రసంగించారు. రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఇంజినీరింగ్‌లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం ఉన్న విద్యార్థులకు తప్పనిసరిగా కొలువు లభిస్తుందన్నారు. వర్సిటీల విద్యార్థులు సైతం ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో సమానంగా వార్షిక ప్యాకేజీలకు ఎంపికవుతున్నారని చెప్పారు. ఏయూ సీఎస్ఈ ప్రొఫెసర్ సత్యానంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు విస్తరిస్తున్నందున నైపుణ్యాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోణంకి శ్రీధర్ పాల్గొన్నారు.

హరిపురం డయాలసిస్ సెంటర్‌కు మరో రెండు బెడ్లు



హరిపురం సీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ బెడ్లు

మందస: మండలంలోని హరిపురం డయాలసిస్ సెంటర్‌లో మరో రెండు బెడ్లు అదనంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ పది బెడ్లు ఉన్నాయి. అయితే ఇవి సరిపోవడం లేదని మంత్రి సీదిరి అప్పలరాజు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో మరో రెండు బెడ్లను మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన మిషనరీ, బెడ్లను ఇన్‌స్టాల్ చేసినట్టు అపోలో డయాలసిస్ క్లినిక్ కేంద్రం మేనేజర్ దువ్వూరి స్వరూప్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక బాధితులకు దగ్గరగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే హరిపురంలోనూ సెంటర్ ఏర్పాటు చేశారు.

గ్యాస్ సిలెండర్ ధర పెంపుపై నిరసన

ఎచ్చెర్ల క్యాంపస్: గ్యాస్ సిలెండర్ ధర పెంపుపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో గురువారం నిరసన తెలియజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ఒక్కసారి వాణిజ్య సిలెండర్‌పై రూ. 350, గృహ వినియోగ సిలెండర్‌పై రూ. 50 పెంచడం వల్ల సామాన్యులు, చిరువ్యాపారులపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు పాటిస్తోందని విమర్శించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బొడ్డపాడు విద్యార్థి

పలాస: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మురిపింటి రోహిత్ ఎంపికయ్యాడు. పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన రోహిత్ ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం జట్టు తరఫున ఆడాడు. ఈ విద్యార్థి ఆంధ్రా కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో అతనికి సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారు. అలాగే అండర్ -14 విభాగం క్రికెట్‌లో మచిలీపట్నంలో జరిగిన పోటీల్లో రాపాక సాహిత్ పాల్గొని చక్కటి ప్రతిభను కనపరిచాడు. వీరిద్దరినీ పాఠశాలలో ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, పి.డి రామ్‌జీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము చోరీ

నందిగాం: కొత్త అగ్రహారం సచివాలయ పరిధిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేయాల్సిన పింఛన్ సొమ్ము రూ.80 వేలు చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 28న సాయంత్రం సచివాలయ పంచాయతీ కార్యదర్శి మీనాక్షి బ్యాంకు నుంచి నగదు తీసుకొచ్చి గ్రామ వలంటీర్లకు ఇచ్చేందుకు తన టేబుల్‌పై పెట్టారు. ఆ సమయంలో ఆరుగురు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు. బ్యాగ్‌ను అక్కడే మరిచిపోయి బయటకు వెళ్లిన ఆమె తర్వాత వచ్చి చూడగా నగదు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది డబ్బులు వేసుకుని పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తి తెలిపారు.

ఫెర్రో కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు



పరిశ్రమ యాజమాన్యంతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్, అధికారులు

టెక్కలి: మండలంలోని రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలో కార్మికులకు మౌలిక సదుపాయాలు, పూర్తి స్థాయిలో వేతనాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖాధికారులు చెప్పారు. ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలో రోజు వారీ వేతనాల్లో కోత విధిస్తున్నారని, పరిశ్రమలో కనీస వసతులు కల్పించడం లేదని, పదవీ విరమణ చేసిన వారికి సదుపాయాలు కల్పించడం లేదని, కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఇటీవల కార్మికులంతా టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ సమక్షంలో కాలుష్య నియంత్రణ అధికారులు, కార్మిక శాఖాధికారులు, పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు అందించాలని, పరిశ్రమలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ యాజమాన్యానికి ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ శంకర్‌నాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.ఎస్.నారాయణ, పరిశ్రమ ప్రతినిధులు సింహాచలం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో 'యాస్పైర్ 2కే23'




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో యాస్పైర్ 2కే23 జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఏటా కళాశాలలో పెద్ద ఎత్తున సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఏపీ, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 704 మంది విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులతో హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రాజెక్టులకు 5 లక్షల రూపాయల వరకు ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. భాగ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉత్తమ విద్యార్థులకు పారితోషికాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ యు.డి.ప్రసన్న, కో-కన్వీనర్లు పి.శ్రీహరి, బి.రమేష్‌నాయుడు, కె.వి.లలితాభవాని, జె.నరేష్ కుమార్, టి.మాధురి, కె.హర్ష తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం

- సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆమదాలవలస రూరల్: మండలంలోని అక్కివరం పంచాయతీ కొత్తరోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ మైక్రోవేవ్ ఎక్స్ఛేంజ్ సెల్‌టవర్ వద్ద గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సెల్‌టవర్ ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు, రెల్లి పొదలు ఏపుగా పెరిగి పూర్తిగా ఎండిపోయి ఉన్నాయి. అటువైపుగా వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి రెల్లి పొదలపై వేయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చునని బీఎస్ఎన్ఎల్ అధికారులు భావిస్తున్నారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది శ్రీకాకుళం అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే ఓఎస్‌డీ డక్, పీవీసీ వంటి సిగ్నల్ వైర్లు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు.